# కొత్తమలుపులో ఉరిశాడు!

"శారదా హిప్‌హిప్ హుర్రే"-కోర్టు హాలంతా ఒక్కసారిగా జయజయ ధ్వానాలతో మార్మోగిపోయింది.

శారదకు మొహమంతా చిరుచెమట పట్టింది.

రాధాదేవి ఆమెవైపు చూసి, అభినందన పూర్వకంగా-"బ్రేవో మై చైల్డ్" అని వెన్ను తట్టింది.

శారదకు అంటార్కిటికాలో నిలబడినట్టయింది. రాధాదేవి వైపు కృతజ్ఞతతో చూసింది. "ఈ విజయం మీది" అనేసరికే ఆమె కంఠం రుద్ధమైంది. కళ్ళు సజలాలైనాయి.

శారదను చేయిపుచ్చుకుని నడిపించుకుంటూ ముందుకు దారితీసింది, రాధాదేవి.

కోర్టు ఆవరణలో శారద స్నేహితురాళ్ళంతా కోలాహలం చేస్తున్నారు. ఆవరణ నుంచీ చాలా మంది వడివడిగా మెట్లకేసి వస్తున్నారు.

ఎవరెవరో కరచాలనంచేసి, తమ వెనుక నుంచున్న వారికి దారినిస్తూ పక్కకి తొలగి నిలబడుతున్నారు.

ఓ వైపునుంచీ ఫ్లాష్ కెమేరా క్లిక్ మన్నది.

రాధాదేవీ, శారదా మెట్లుదిగి క్రిందికి వచ్చారు.

ఎదురుగా టాప్‌లెస్ కారు!

రజని, సావిత్రి-మొహాల్లో ఆనందం తాండవిస్తోంది.

చేతుల్లోనిలుపెత్తు పూలదండలతో వాళ్ళిద్దరూ శారదనీ, రాధాదేవినీ ఆహ్వానించారు.

పూలమాలలు వేస్తూంటే మరోసారి ఆకాశం ప్రతిధ్వనించింది. "శారదా—రాధాదేవీ—బ్రేవో" అంటూ,

పూంగుత్తుల్ని వాళ్ళిద్దరి చేతులకీ అందిస్తూ, "ఒక్క-క్షణం నిశ్శబ్దం" అని అరిచింది స్నేహ.

వాతావరణం సద్దుమణిగింది.

"ఈ వ్యవహారాన్ని కోర్టుదాకా తీసుకుపోయి, రచ్చకెక్కి-తే తన కుటుంబం పరువు మర్యాదలు పోతాయనీ; కడుపుచించుకుంటే కాళ్ళ మీదే పడుతుందనీ—పాత చింతకాయ ఆలోచనల్ని పక్క-కితోసి; అతి సాహసంతో, ధైర్యంతో ముందడుగు వేసి-ఈ విజయం సాధించింది మనశారద. ఆమెకు రాధాదేవిగారి ఆదరణ అండగా నిలిచింది. వీరిద్దరి విజయం-మన స్త్రీజాతి మొత్తానికీ విజయం. న్యాయస్థానం ఈ రోజున ఇచ్చిన తీర్పు నిజంగా విలక్షణమైనది; మన న్యాయవ్యవస్థకే గర్వకారణంగా ఉదహరించుకోదగింది. దానికి అంతటి చారిత్రాత్మక ప్రాధాన్యత వున్నది. ఈ తీర్పు సంగతిని వూరూరా, వాడవాడలా ఆడవారికి తెలిసేలా చేయాలి. ఆ ప్రయత్నానికి నాంది-ఈ వూరేగింపు. అంతారండి. జయ జయధ్వానాలతో పదండి ముందుకు"

స్నేహ ఉపన్యాసానికి చప్పట్లు మిన్ను ముట్టాయి.

శారదా రాధాదేవి కారులో కూర్చున్నారు. కారు కదిలింది.

* * *

సాయంత్రం వరకూ వచ్చిపోయే అతిధులతో ఇల్లంతా హడావిడిగా వుండిపోయింది.

అందరూ రాధాదేవినీ, శారదను అభినందించి వెళ్ళారు.

అంతా కలలా, కలలో పండుగలా జరిగిపోయింది.

రాత్రి—

ఒంటిగా తన గదిలో పడుకుంది, శాంత.

ఆ రోజు వెలువడిన చారిత్రాత్మకమైన తీర్పు, దాని వెనుకనున్న గాథ-ఆమెకు గుర్తుకొచ్చినై.

—తనను ప్రేమిస్తున్నట్టు నటించి, మానసికంగా, శారీరకంగా తనను వంచించి, తీరా తాను తల్లికాబోతున్నట్టు తెలియగానే-తన కేమీ తెలీదని బుకాయించి: "నీ దిక్కున్న చోట చెప్పుకో" మని తృణీకరించి, తనను కులట, నీచురాలు అని బిల్లగుద్ది చెప్పిన-ప్రభాకర్-దోషి అని కోర్టు తీర్పు ఇచ్చింది! కోర్టు ఆ విధంగా తీర్పు యివ్వడానికి అవసరమైన సాక్ష్యాధారాల్ని సమర్పించడమేగాక, తాను నైతికంగా నిలబడగల శక్తిని కూడా ప్రసాదించింది రాధాదేవి.

ఈ వ్యవహారాన్ని కోర్టుకు తీసుకుపోతాననీ, అమీ తుమీ తేల్చుకుంటాననీ, అమాయకురాలైన కన్నెపిల్లలకి భవిష్యత్తులో ఇలాంటి అన్యాయం జరగకుండా వుండేట్లు ఒక హెచ్చరికను చేయిస్తాననీ-తాను పట్టుదలపట్టినప్పుడు-లాయిర్‌గా వున్న తన తండ్రే తనను వారించాడు. ఈ విషయంలో కోర్టు ఏమీ చేయలేదని భయపెట్టాడు.

అప్పుడు అమ్మా నాన్నా చెప్పిన మాటలూ, చేసిన హెచ్చరికలూ, చివరగా సాగించిన బెదిరింపులూ, కడకు నిర్దయగా ఒక్కగానొక్క కూతురన్న మమకారంగానీ, వట్టిమనిషి కూడా కావన్న కారుణ్యంగానీ లేకుండా -ఇంట్లోంచీ బయటికి నడిపిన దృశ్యం-తలపుకు రాగానే—శారద కళ్ళు సజలాలైనాయి.

రెండేళ్ళు తన ఇంట్లో వుంచుకుని కన్నతల్లిగానే సాకింది, రాధాదేవి.

ఆమే తనకు తల్లీ, తండ్రీ, గురువు, దైవంగా మారింది.

సుధాకర్‌కి నిజానికి ఆమే అమ్మమ్మ!

—శారద హృదయం రాధాదేవిపట్ల కృతజ్ఞతతో ఆర్ద్రమైపోయింది.

ఇంతటి చారిత్రాత్మక పరిమాణానికీ మరి ఆమే బాధ్యురాలు. తనను ఎవరెన్ని విధాల అభినందించినా, ఆ అభినందనలన్నిటికీ నిజమైన హక్కుదారు—రాధాదేవే!

అవును. తననీ రోజున ఎందరు ఎన్ని విధాల అభినందించారు!

'కానీ,'

అమ్మా, నాన్నా ఏరీ?—వాళ్ళురాలేదు. రారు!

ఈ ఆలోచన రాగానే శారద కళ్ళు చెమర్చినై.

గుండెల్లో వోమూల ఏదో శూన్యం—తనను వెక్కిరించినట్లనిపించింది.

సుధాకర్‌ని గుండెలకు అదుముకుని, వెచ్చగా దగ్గరకు చేర్చుకుని వాడితల నిమురుతూ పడుకుంది శారద.

గదిలో గుడ్డిదీపం వెలుగుతోంది. కానీ, బయటంతా చీకటి. ఇప్పుడో మరుక్షణమో వర్షం ముంచుకు వచ్చేటట్లు గాలి వీస్తోంది. వాతావరణం మారిపోయింది.

*　　*　　*

ఇది జరిగిన ఆరో రోజున—

సాయంత్రం నాలుగు గంటలవుతోంది.

శారద హాల్లో ఉయ్యాల మంచం మీద కూర్చుని పిల్లవాడికి పాలిస్తోంది. రాధాదేవి తన గదిలో ఏదో చదువుకుంటోంది.

టాక్సీ వచ్చి ఇంటిముందు ఆగింది.

ప్రభాకర్ దిగేడు. నెమ్మదిగా లోపలికి వచ్చేడు.

శారద తొట్రుపడి, సుధాకర్‌ని పక్కనే పడుకోబెట్టి లేచి నిలబడింది చీరెకుచ్చిళ్లూ, పమిటచెంగూ సవరించుకుంటూ.

అతను కుర్చీలో కూర్చున్నాడు.

ఈలోగా రాధాదేవి హాల్లోకి వచ్చింది.

సూటిగా విషయం ప్రస్తావించాడు, ప్రభాకర్—"శారదనీ, బాబునీ ఇప్పుడే ఇంటికి తీసుకువెళ్ళాలని వచ్చాను."

శారదా, రాధాదేవీ ఒకరి మొహాలొకళ్ళు చూసుకున్నారు. ఇద్దరి కళ్ళల్లోనూ ఆనందం తొణికిసలాడింది. ఇద్దరి కనుకొలకుల్లోనూ ముత్యాలు మెరిసినై. ఇద్దరి మనస్సులూ విచిత్రమైన భావ సంఘర్షణకు లోనైనాయి.

క్షణాల తర్వాత.

మాటలు కూడగట్టుకుని అన్నది, రాధాదేవి-"వెరీగుడ్. నాకు చాలా ఆనందంగా వుంది. అయామ్ రియల్లీ గ్లాడ్."

అప్పటికప్పుడే శారద వంటింట్లోకి పరుగుతీసింది.

హాల్లో గోడలకు తగిలించిన చిత్ర పటాలూ, ఇతర బొమ్మలూ చూస్తూ కూర్చున్నాడు ప్రభాకర్-వాటికి మధ్యగా శారద డిగ్రీ సర్టిఫికెట్‌ని చూశాడు. అవును-అది ఆమె ఫస్ట్‌క్లాస్ డిగ్రీ సర్టిఫికెట్!

శారద ప్రేమ వ్యవహారంలోనూ, ఆ తర్వాత కోర్టు కేసు వ్యవహారంలోనూపడిపోయి-తాను సాధించలేని విజయాన్ని సాధించి, డిగ్రీ సర్టిఫికెట్‌ని పొంది, దానికి ఫ్రేము కట్టించుకుని ప్రదర్శిస్తోంది శారద.

కాఫీ తెచ్చి ప్రభాకర్‌కి అందించింది, శారద.

అతను తలవంచుకుని మౌనంగా కాఫీ సిప్ చేయసాగేడు.

శారదా, రాధాదేవీ పెరటిలోకి నడిచేరు.

వాళ్ళిద్దరి ఆకాంక్ష ఫలించింది. అందువలన ఇద్దరూ ఒకరి నొకరు అభినందన పూర్వకంగా చూసుకుంటూ, చకచకాపనులు పూర్తి చేయడానికి సిద్ధపడ్డారు.

జడ అల్లుకుంటున్న శారదతో అన్నది రాధాదేవి-"కోర్టుతీర్పుని శిరసావహించి, ఇంత త్వరగా వచ్చి నిన్నూ బాబుని తీసుకెళ్తాడా అని అనుమానించాంగానీ, ప్రభాకర్‌లో మంచి పరివర్తనే వచ్చింది. నువ్వాలా అదృష్టవంతురాలివి."

"ఇవంతా సుధాకర్ అదృష్టం, మీ విజయం." అంది శారద, కృతజ్ఞతాభావంతో.

నన్నగా నవ్వేసి, గలగలా అనేసింది-రాధాదేవి, "ఇది ఫక్తుసినిమా డైలాగ్" అని. శారద పెదవుల మీదా చిరునవ్వు విరిసింది.

ఐదు గంటలవుతుండగా—

ప్రభాకర్, శారద పిల్లవాణ్ణి తీసుకుని టాక్సీ ఎక్కారు.

సంతృప్తి మెరుస్తున్న కళ్ళతో, ఆనందం విరిసిన గుండెతో-వారికి వీడ్కోలు చెప్పింది-రాధాదేవి.

* * *

మర్నాడు సాయంత్రం కోర్టునుంచీ సరాసరి శారదావాళ్ళ ఇంటికే వచ్చేసింది, రాధాదేవి.

శారదా, బాబూ తప్ప యింట్లో ఎవరూలేరు.

శారదని వివరాలడిగింది రాధాదేవి.

"రచ్చగెలిచి పేరు తెచ్చుకున్న దాని ఫలితం ఇది. వాళ్ళ అమ్మా నాన్న ఈ ఇంట్లో వుండమని వేరే ఇంటికి వెళ్ళిపోయారట"

"అదీ ఒకందుకు బాగానే వుంది. ప్రభాకర్ నువ్వూ కొంత స్వేచ్ఛగా వుండేందుకు వీలవుతుంది. నీకోపం నా బాగుకు అన్నట్టు పోతేపోయార్లే

ముసలోళ్ళు" అంది రాధాదేవి.

అంతలోనే మాటమారుస్తూ "మీ హీరోగారు రాత్రి ఏమంటారు?" అని కొంటెగా ప్రశ్నించింది.

శారద సిగ్గుపడింది. ఆమె కళ్ళల్లో జాలువారుతున్న వెన్నెలవాకల్ని అర్థం చేసుకోగలిగింది రాధాదేవి.

మరో గంటకి ప్రభాకర్ వచ్చేడు. అతనితో సంభాషణ ప్రారంభించింది, రాధాదేవి.

"ఇతరులచేత చెప్పించుకునే విధంగా వుండకూడదు మీసంసారం. జరిగిపోయిందేదో జరిగిపోయింది. ఇకముందు, మీ జీవితంలో వేడినిట్టూర్పులే వుండకూడదు. దానికి తొలిచర్యగా మీ వివాహం గురించి ఆలోచించుకోండి"

చిత్రంగా నవ్వేడు ప్రభాకర్. శారద తలవంచుకుని గమనించసాగింది.

క్షణాల తర్వాత అతనన్నాడు, "కోర్టు తీర్పులోనే సేమిద్దం భార్యాభర్తలం అని అర్థంవచ్చే పదజాలమంతావుంది. దానికి తోడు ఈ వాస్తవానికీ అద్దంపడుతూ సుధాకర్ వుండనేవున్నాడు. ఇంకే తతంగమూ అక్కర్లేదు. మమ్మల్నిలా వుండనీయండి,"

శారదకేసి సాలోచనగా చూసింది రాధాదేవి.

ఆమెకూడా అతని అభిప్రాయాన్ని బలపరుస్తున్నట్టే తలవూపింది.

శారద అమ్మా నాన్నకి కూడా యీ వర్తమానాన్ని తెలుపుతానంటూ, అది తన ధర్మమంటూ చెప్పి వెళ్ళిపోయింది రాధాదేవి.

* * *

రెండు నెలలు గడిచేయి. ఈలోగా,

కోర్టు సెలవులని తమ పల్లెకూ, అటునుంచీ బెంగుళూరు, వూటీ

మొదలైన ప్రదేశాలకూ వెళ్ళివచ్చింది రాధాదేవి.

చుట్టపుచూపుగా వచ్చిన రాధాదేవిని చూసీ చూడగానే శారద దుఃఖం కట్టలు తెంచుకుంది. ఆమెను కావలించుకుని పసిపిల్లలా బావురుమంది.

సాంసారిక జీవితంలో ప్రభాకర్ తన పైన జరుపుతూ వున్న చిత్ర హింసల తాలూకు చిహ్నాలన్నిటినీ, సిగ్గువిడిచి రాధాదేవికి చూపింది శారద.

రాధాదేవి విభ్రాంతపోయింది. ఆమెకు తల తిరిగిపోయింది. తాను నిలబడిన నేల యావత్తూ పాతాళానికి దిగబడిపోతున్నట్లనిపించింది. శారద చెప్పిన వివరాలు గుండెల్ని తూట్లుపొడిచినై.

ప్రభాకర్ శాడిస్ట్‌గా తయారైనాడు.

"నన్ను భార్యగా అంగీకరించి తను చేసిన పనికి పశ్చాత్తాపంతో-నన్ను ఏలుకోవలసిందిగా కోరినందుకు అక్షరాలా దాన్ని పాటిస్తున్నాడు ప్రభాకర్. మీరూ నేనూ కలిసి సాధించిన విజయం ఫలితాన్ని అతను పూర్తిగా అనుభవించదల్చుకున్నాడు. అందుకనే నా మీద కక్షసాధిస్తున్నాడు. రోట్లో తలదూర్చిన చందాన తయారైంది నా పరిస్థితి. దొంగకి తేలు కుట్టినట్లున్నది. ఇప్పుడు ఏది దారి?"—శారద బెంబేలు పడిపోయింది.

రకరకాల ఆలోచనలతో మేధస్సుకొడి గట్టిపోతోంది రాధాదేవికి. చట్టం ఆధారంతో న్యాయస్థానంలో సాధించిన విజయానికి ఇదా ఫలితం?

ఆమె కళ్ళముందు—

శారద పెదవులమీది కాలిన మచ్చలు, శరీరంమీది వాతలూ, బ్లేడుతో చేసిన గంట్లూ—

వికృత నాట్యం చేయసాగేయి.

ఆమె చెవుల్లో—

"నగ్నంగా తన తొడలమీద కూర్చుని సిగరెట్ కాలుస్తూ ముద్దివ్వమనీ, కాదంటే స్తంభానికి కట్టేసి కొట్టడమనీ"-శారద చెప్పిన మాటలు-

మార్మోగుతున్నై.

ఏమిటి తాను సాధించిన విజయం?-

శతకోటి ప్రశ్నలు రాధాదేవి తలలో మొలిచి, మొక్కలై, మహా వృక్షాలై, శాఖోప శాఖలతో వికటాట్టహాసాలు చేస్తున్నై!

ఎంతటి ధైర్యసాహసాలూ, వీరత్వం ప్రదర్శించినా-స్త్రీ-పురుషుడి అహంకారానికి ఇలా బలై పోవలసిందేనా?

ప్రభాకర్‌ని మళ్ళీ రచ్చకీడ్చి, కోర్టు కెక్కిస్తే?

ఇందుకు శారద గతంలోలాగా ఎగిరి గంతేసి ముందుకు వస్తుందా?

వచ్చినా-తాను నిలిచి, ఎగిరి గెలవగలదా?

అన్నీ ప్రశ్నలే!

భయంకరమైన ఈ అనుభవం-రాధాదేవిని ముందు దైహికంగా క్రుంగ దీసింది. వెయ్యి గుయ్యారాలు నెత్తినపడ్డటు నీరసంతో, నిస్పృత్తవతో, దిగులుతో, భయంతో, ఆ రాత్రిని తెల్లవార్చింది-ఆమె!

రాధాదేవి ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చేలోగానే—

నాలుగోరోజు ఉదయాన్నే—

సుధాకర్‌ని ఎత్తుకుని, సూట్‌కేస్‌తో ఇంటికి వచ్చేసింది శారద.

ఆశ్చర్యపడకపోయినా, వివరం ఏమిటంది రాధాదేవి.

"డర్టీరోగ్! రాత్రి తాను బాగా తాగివచ్చి, నా గదిలోకి ఎవడినో పంపి బయట తలుపుకి గొళ్ళెంపెట్టి వసారాలో కూర్చున్నాడు. ఆ వచ్చిన వాణ్ణి కొట్టిమంచానికి కట్టిపడేసి, దొడ్డి తలుపుని విరగ్గొట్టి వచ్చేశాను."

కళ్ళు పెద్దవి చేసుకుని శారద వైపు చూస్తోంది రాధాదేవి. శారద కంఠస్వరంలో తెగువ, తెంపరితనం, ధైర్యం, సాహసం, కోపం, రోషం, కసి— అన్నీ దుముకుతున్నై.

"ఇంతటి వీరత్వం ప్రభాకర్ చర్యలపట్ల ఎందుకు చూపలేక

పోయావ్ ఇన్నాళ్లూ" అని అడగకుండా వూరుకోలేకపోయింది, రాధాదేవి.

శారద తలవంచుకుంది. వెంటనే జవాబివ్వలేదు. క్షణాల తర్వాత నెమ్మదిగా అన్నది, "ఎంతచెడ్డా భర్తగా అంగీకరిద్దామని సహించాను. ఆ సహనానికీ హద్దుందని మళ్ళీ గుణపాఠం నేర్చుకున్నాను!"

రాధాదేవికి శారద మాటలు గుండెల్లో గుచ్చుకున్నాయి.

కొత్త మలుపులో పయనించబోయి, న్యాయం కావాలని ఎలుగెత్తి చాటబోయి—ఉరిత్రాడును వరించినట్లయింది, శారద కథ-అనిపించింది రాధాదేవికి.

'ఈ పాపం, ఫలితం ఎవ్వరిదీ?' అని కోటికంఠాలు ఒకేసారిప్రశ్నిస్తుంటే—వాటిపెనగ్గా అగ్గిరెమ్మలు దర్శనమిస్తున్నాయి రాధాదేవికి. ఆ అగ్గిరెమ్మల వెలుగులో—శారద బియ్యే డిగ్రీ-సమాధానంగా నిలిచింది! ఇప్పుడంతా మౌనంగా, నిశ్శబ్దంగా వుంది!